నేటి నుంచి ఫార్మెటివ్ 3 పరీక్షలు

- పూర్తయిన ఏర్పాట్లు
- విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అనేక మార్పులు తీసుకొస్తోంది. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం, పకడ్బందీగా పరీక్ష నిర్వహణ, విద్యార్థి సమగ్ర అధ్యయనానికి తోడ్పడేలా పరీక్షా విధానంలో సమూల మార్పులు చేసింది. ఈ క్రమంలోని ఈ విద్యా సంవత్సరంలో నవంబర్‌లో నిర్వహించిన మొదటి ఫార్మెటివ్ పరీక్షలను సీబీఏ విధానంలో క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పద్ధతిలో జరిపారు. ఈ విధానంలో మొత్తం 20 మార్కుల పరీక్షకు 15 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, ఐదు మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. విద్యార్థులు జవాబులు ఓఎంఆర్ షీట్లపై పూరించారు. ఇప్పటి నుంచీ ఓఎంఆర్ షీట్లను పూర్తి చేయడంపై విద్యార్థులకు పూర్తి అవగాహన కలిగితే భవిష్యత్తులో వారు వివిధ పోటీ పరీక్షలను సునాయాసంగా రాయగలుగుతారనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానం ప్రవేశపెట్టింది. ఈ పరీక్షలకు ద్విబాషా పద్ధతిలో ప్రశ్న పత్రాలు ఉంటాయి. విద్యార్థికి ఇంగ్లీషులో అర్థం కాకపోతే తెలుగులో ప్రశ్నలను చదివి సులభంగా అర్థం చేసుకునే వీలు ఇచ్చారు.

పరీక్షలపై పలు సూచనలు

రాజమహేంద్రవరం అర్బన్‌లో ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్ స్కూళ్లు 87 ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ 9,406 మంది బాలురు, 8,913 మంది బాలికలు.. 18,319 మంది చదువుతున్నారు. అలాగే సుమారు 140 ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ సుమారు 11 వేల మంది, ఆరు నుంచి పదో తరగతి వరకూ సుమారు పదిహేను వేల మంది చదువుతున్నారు. రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని 60 ప్రభుత్వ స్కూళ్లలో 13,579 మంది, అలాగే 64 ప్రైవేట్ స్కూళ్లలో 17,275 మంది.. మొత్తం 124 స్కూళ్లలో 30,854 విద్యార్థులు మంగళవారం నుంచి పదో తేదీ వరకూ పరీక్షలు రాయనున్నారు. నిర్మాణాత్మక మదింపు–3 పరీక్షల నిర్వహణకు సూచనలను స్థానిక విద్యాశాఖాధికారులు తెలిపారు. దీనిని ఉపాధ్యాయులందరూ పూర్తిగా చదివి అర్థం చేసుకుని పరీక్ష నిర్వహించాలి. ప్రతి పరీక్ష రోజు పాఠశాలకు కేటాయించిన ప్రశ్నాపత్రాలను, పరీక్షకు గంట ముందు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఇవ్వాలి. విద్యార్థులు పొందిన మార్కులను ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపాలి. తక్కువ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ఈ సూచనలన్నీ తు.చ తప్పకుండా పాటించాలని విద్యాశాఖాధికారులు అన్ని యాజమాన్య పాఠశాలలకు ఆదేశాలిచ్చారు.


ఓఎంఆర్‌ను షీట్‌పై పరీక్ష రాస్తున్న విద్యార్థిని (ఫైల్)

క్లుప్తంగా

రజకుల సంక్షేమానికి కృషి

వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్


ధవళేశ్వరంలో ఘాట్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: రజకుల సంక్షేమానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. గొల్లపేటలోని రజకుల ఘాట్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. తొలుత స్థానిక రామాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గంగా రజక అభివృద్ధి సంఘ సభ్యులతో స్థానిక రామాలయంలో సమావేశమయ్యారు. అక్కడ నెలకొన్న సమస్యలను వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), గంగా రజక అభివృద్ధి సంఘ సభ్యులు వివరించారు. గొల్లపేట రజకుల ఘాట్ అభివృద్ధికి కృషి చేస్తానని, త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని చందన నాగేశ్వర్ హామీ ఇచ్చారు. రజకుల చిరకాల కోరిక అయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ పర్యవేక్షక ఇంజినీర్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, రజక సంఘం అధ్యక్షుడు కొమ్మంటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఉల్లేటి సత్యనారాయణ, కార్యదర్శి కోరుమిల్లి నాగరాజు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ


ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

కంబాలచెరువు: జాంపేట చాపల మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ లూథరన్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను పంపిణీ చేసారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

ప్రభుత్వ సహాయం పెంచాలి

ప్రకాశం నగర్: పేదల ఇళ్లకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షల సాయాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరుతూ సీపీఐ పోరుబాటలో భాగంగా సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ సిమెంటు, ఇసుక, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఈ నెల 22న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ భక్త బృందం తెలిపింది. దాతలు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమానికి అందరూ తరలిరావాలని కోరింది.

వేలం ద్వారా రూ.7.63 లక్షల ఆదాయం

బిక్కవోలు: మండలంలోని శ్రీలక్ష్మీ గణపతి స్వామివారి ఆలయంలో వేలం ద్వారా ఏడాదికి రూ.7.63 లక్షల ఆదాయం వస్తుందని ఆలయ ఈవో రామలింగ భాస్కర్ తెలిపారు. సోమవారం ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొబ్బరి చెక్కలకు రూ.3,75,000, పటికీ బెల్లం, బెల్లం ద్వారా రూ.3,00,000, దేవుడికి సమర్పించే వస్త్రాల ద్వారా రూ.88,000 ఆదాయం వస్తుందని చెప్పారు. వేలం పాట కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల్లో 320 మందికి సేవలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం సాధారణ, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సత్యం రమేష్‌బాబు, యన్నమనేని రామచంద్రరావు, రాయుడు శ్రీనివాస్ 320 మందికి వైద్యసేవలు అందించారు. 15 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, ఉచిత ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకటనారాయణ, చంటిబాబు, సురేష్ బాబు, కె.విజయ్ కుమార్, కె.శ్రీనివాసరావు, ఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విశ్రాంతి షెడ్డు నిర్మాణం

కడియం: దుళ్ల మార్కెట్ సెంటర్‌లోని శారదా అమ్మవారి ఆలయం ఎదురుగా సుమారు రూ.4 లక్షలతో విశ్రాంతి షెడ్డు నిర్మించారు. దాతల సహకారంతో దీనిని నిర్మించినట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఏటా దేవీ నవరాత్ర ఉత్సవాలను ఈ ఆలయం వద్ద వైభవంగా నిర్వహిస్తారు. ఆ సందర్భంగా జరిగే కుంకుమ పూజలను భక్తులు ఈ షెడ్డులో కూర్చుని సౌకర్యవంతంగా నిర్వహించుకోవచ్చు.

నేడు విద్యుత్ అంతరాయం

ధవళేశ్వరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఇండస్ట్రియల్ కాలనీ, ఎర్రకొండ, ఇనోసాల్ట్, రత్నా ట్యూబ్స్, మంతెన ఆశ్రమం, బీఏస్ఆర్ కాలనీ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు


బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీనటుడు ఆలీ

- ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు ఆలీ
- ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రకాశం నగర్: చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీనటుడు ఆలీ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమవారం జరిగిన రాజమహేంద్రవరం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) సీజన్ –5 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐపీఎల్‌కు ఏమాత్రం తగ్గకుండా ఆర్‌పీఎల్‌ను కొనసాగిస్తున్న మాజీ కార్పొరేటర్, ఆర్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంటు చైర్మన్ అజ్జరపు వాసు, ఆయన మిత్రబృందాన్ని అభినందించారు.

ఆర్ట్స్ కళాశాల మైదానానికి ఎంతో ఘన చరిత్ర ఉందని, ఇక్కడ నుంచి ప్రస్థానాన్ని ప్రారంభించిన వారు ఎందరో ఉన్నత శిఖరాలను అధిరోహించారని గుర్తుచేశారు. ఇప్పటికే ఆర్‌పీఎల్ ఆడిన ఇద్దరు క్రీడాకారులు ఐపీఎల్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఒక బాక్సింగ్ క్రీడాకారిణికి మిత్రుల సహకారంతో ప్రోత్సాహాన్ని అందించామని, ప్రస్తుతం ఆమె ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడేందుకు కెనడాలో శిక్షణ తీసుకుంటోందన్నారు.

నగరానికే గర్వకారణం

మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఎనిమిది రాష్ట్రాల నుంచి 28 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నమెంటు ఐపీఎల్‌కు ధీటుగా జరగడం రాజమహేంద్రవరం నగరానికే గర్వకారణమన్నారు. రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ ఐదు సీజన్లుగా ఆర్‌పీఎల్ నిర్వహించడంపై అభినందించారు. పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఆర్‌పీఎల్‌ను నిర్వహిస్తున్న వాసుకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ ప్రసంగించారు. రాయల్ యునైటెడ్ క్రికెట్ క్లబ్, కేసీసీ సురేష్ వారియర్స్ జట్లు మధ్య జరిగిన ప్రారంభ మ్యాచ్‌ను ఆలీ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అంతకు ముందు మంజీరా హోటల్ నుంచి భారీ స్కూటర్ ర్యాలీ నడుమ ఆలీ ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకున్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు గుబ్బల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, డాక్టర్ రౌతు పార్థసారథి, డాక్టర్ కృష్ణారావు, బీవీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డులో త్వరితగతిన అభివృద్ధి పనులు

- ఎంపీ భరత్‌రామ్
- అధికారులతో కలిసి పరిశీలన


మెయిన్ రోడ్డులో పనులను పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని మెయిన్ రోడ్డు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదేశించారు. కోటగుమ్మం సెంటర్ నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషను వరకూ జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. రహదారిపై పడిన పెద్ద గుంతలను పూడ్చే పనులను తొలుత చేపట్టామని, అవి పూర్తయిన తర్వాత పదిహేను రోజుల్లో తారురోడ్డు పనులు పూర్తి చేస్తామని మున్సిపల్ ఎస్‌ఈ పాండురంగారావు వివరించారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఎంతో కాలంగా మెయిన్ రోడ్డు అభివృద్ధికి నోచుకోకపోవడంతో అనేక చోట్ల పెద్ద గోతులు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వ్యాపారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఈ సమస్యను తన దృష్టికి తీసుకు రావడంతో వివిధ శాఖల అధికారులతో వచ్చి రెండు మూడు సార్లు సమగ్రంగా పరిశీలించిన మీదట ఈ పనులు ప్రారంభించామన్నారు. వాస్తవానికి ఎస్‌ఆర్‌సీపీ డ్రెయిన్ అమృత్‌లో నిర్మించాలని, ఆ తరువాత రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఆ డ్రెయిన్ నిర్మాణం ప్రారంభిస్తే కొన్ని నెలల పాటు వ్యాపారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, అందువల్ల మొదట వ్యాపారుల విజ్ఞప్తి మేరకు రహదారి అభివృద్ధి, విద్యుత్ పనులు ప్రారంభించామన్నారు. రహదారి పనులు పూర్తి కాగానే విద్యుత్ పనులు చేపడతారని, స్థానిక దేవీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన విధంగా విక్టోరియన్ లైట్లు ఏర్పాటు చేసి హెరిటేజ్ లుక్ తీసుకు రానున్నామన్నారు. కోటగుమ్మం నుంచి మసీదు సెంటర్ వరకూ సుమారు రూ.1.3 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర పాలక సంస్థ ఎస్‌ఈ పాండురంగారావు, సిటీ ప్లానర్ జంగా సూరజ్ కుమార్, కాంట్రాక్టర్ కృష్ణ, ఎంహెచ్‌ఓ వినూత్న, వైఎస్సార్ సీపీ నాయకులు మార్తి లక్ష్మి, వాకచర్ల కృష్ణ, రామ్ సాయిదీప్, కాలే చిన్ని, దూర్వాసుల సత్యనారాయణ, కొత్త బాల మురళీకృష్ణ పాల్గొన్నారు.


బత్తిన సుబ్బారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ భరత్‌రామ్

బత్తిన సేవలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం సిటీ: పేదలకు విశేష సేవలందించిన మహనీయుడు బత్తిన సుబ్బారావు సేవలు, ఆశయాలు చిరస్మరణీయమని ఎంపీ మార్గాని భరత్ రామ్ నివాళులర్పించారు. క్వారీ మార్కెట్ సెంటర్‌లో స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రె కొండబాబు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బత్తిన సుబ్బారావు జయంత్యుత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ కాలంలోనే పేదలందరికీ ఇళ్ల పట్టాలను అందజేసి, సొంతింటి కలను నెరవేర్చారన్నారు. బత్తిన సుబ్బారావు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను క్రమం తప్పకుండా బర్రె కొండబాబు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర శాఖ అధ్యక్షుడు అడపా శ్రీహరి, టీకే విశ్వేశ్వర రెడ్డి, కాటం రజనీకాంత్, చోడిశెట్టి సత్యవాణి, తిరగాటి దుర్గ పాల్గొన్నారు.

క్రికెట్ జట్టు సభ్యులకు అభినందన

రాజమహేంద్రవరం సిటీ: సమష్టిగా అడుగులు వేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించగలమని, ఇదే క్రీడా స్ఫూర్తిని విధుల్లో కూడా చూపించడం ద్వారా జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా పనిచేయాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన కలెక్టర్ 11 టీమ్ సభ్యులు కెప్టెన్ కె.దినేష్ కుమార్, జేసీ తేజ్ భరత్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయం సాధించడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.


క్రికెట్ జట్టు సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత

కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నా

ప్రకాశం నగర్: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాణిక్యంబ, కార్యదర్శి కె.బేబీ రాణి, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, 2017 నుంచి పెండింగ్ ఉన్న టీఏ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సుమారు 4 గంటల పాటు జరిగిన ఈ ధర్నాలో అధికారులు వద్దకు వెళ్లేందుకు ఆందోళనకారులు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం కలెక్టర్ 10 మంది ప్రతినిధుల బృందంతో వచ్చేందుకు అనుమతి ఇవ్వడంతో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

25, 26 తేదీల్లో గోదావరి బాలోత్సవం

కంబాలచెరువు: పిల్లల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలోత్సవాలు ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం గోదావరి బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఇప్పటికే దేవరపల్లి, హేలాపురి ప్రాంతాల్లో నిర్వహించిన బాలోత్సవాలకు అద్భుతమైన రీతిలో స్పందన వచ్చిందన్నారు. అంతకుమించిన విధంగా ఈనెల 25, 26 తేదీల్లో రాజమహేంద్రవరం వేదికగా గోదావరి బాలోత్సవం నిర్వహించాలని, అందుకు అవసరమైన రీతిలో తన సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆహ్వాన కమిటీ ఏర్పాటు

గోదావరి బాలోత్సవం ఆహ్వాన కమిటీ ఏర్పాటైంది. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా షేక్.సాబ్జీ, గౌరవ సలహాదారుగా వి.భాస్కరరామ్, అధ్యక్షుడిగా తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు, గౌరవ సలహాదారుగా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఓఎన్‌జీసీ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎంఆర్ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా పీఎస్ఎస్ రాజును నియమించారు.


బాలోత్సవ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తదితరులు

ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేయడమే బీజేపీ లక్ష్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్ని నిర్వీర్యం చేయడమే బీజేపీ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ విమర్శించారు. కాంగ్రెస్ దేశవ్యాప్త పిలుపులో భాగంగా మెయిన్ రోడ్డులోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. బీజేపీ, అదానీకి వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేశాయి. నగర అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలేపల్లి మురళీధర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సోడదాసి మార్టిన్ లూథర్ మాట్లాడారు. ముందుగా సాయికృష్ణ థియేటర్ సమీపంలోని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అక్కడి నుంచి ఊరేగింపుగా ఎల్‌ఐసీ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. వైఏ వడయార్, జ్యేష్ఠ సతీష్‌బాబు, ముళ్ల మాధవ్, బెజవాడ రంగారావు, చింతాడ వెంకటేశ్వరరావు, ఆకుల భాగ్య సూర్యలక్ష్మి పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏపీజేఏసీ సభ్యులకు శుభాకాంక్షలు

రాజమహేంద్రవరం సిటీ: అమరావతి ఏపీజేఏసీ సభ్యులు సోమవారం కలెక్టర్ మాధవీలతను కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జేఏసీ చైర్మన్ ఎంకే ప్రసాదరావు, అసోసియేట్ చైర్మన్ ఎం.గాలిబ్ అహ్మద్, వైస్ చైర్మన్ కె.త్రిమూర్తులు, డాక్టర్ యు.ముఖేష్, జనరల్ సెక్రటరీ ఏఆర్ శివ కుమార్, ట్రెజరర్ ఎస్.స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

పనులపై సంతృప్తి

జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలపై సూచనలు, సలహాలు ఇవ్వడం ద్వారా మరింత సమర్థవంతంగా వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లగలమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసిన కేంద్రబృందం వీరంపాలెంలోని అమృత్ సరోవర్ చెరువు పనులపై సంతృప్తి వ్యక్తం చేసింది.

కేంద్ర పథకాల అమలును తనిఖీ చేసే ఎంపనెల్ సభ్యుడు, డ్వామా పీడీ జీఎస్ రామ్ గోపాల్ కలెక్టర్ మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో వివిధ శాఖలు, సంస్థల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టిన, చేపడుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. వీరంపాలెం 2, వెంకటాపురం, జాతీయ ఉపాధి హామీ, పీఎం ఆవాస్ యోజన, జాతీయ భద్రతా పెన్షన్ పథకం, పీఎం గ్రామీణ సడక్ యోజన, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలు, స్వామిత్వ, పంచాయతీ రాజ్ శాఖ పనులను పరిశీలించారు.

లక్ష్యాల మేరకు వసూలు సాధించాలి

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రణాళిక విభాగం మార్గదర్శకాల అమల్లో నూరుశాతం లక్ష్యాలను సాధించాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూజర్ చార్జీలు వసూలు చేసే ప్రతి ఒక్క రికార్డును నిర్వహణ చేయాలన్నారు. నగరంలో 796 పాట్‌హోల్స్ (గుంటలను) గుర్తించి, వాటి వివరాలు అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. వీటికి పరిపాలన, సాంకేతిక పరమైన అనుమతులు జారీ చేశామన్నారు. టెండర్ ప్రక్రియలో ఉన్నాయని, రాబోయే 45 రోజుల్లో ఆయా పనులు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. వార్డు స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనకు 16 అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ పీఎం సత్యవేణి, సీపీ జె.సూరజ్ కుమార్, ఎస్‌ఈ జి.పాండురంగారావు పాల్గొన్నారు.



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్

ఆకట్టుకుంటున్న వసుధ వస్త్ర ప్రదర్శన


ప్రదర్శనకు తరలివచ్చిన మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులోని జేకే గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన, విక్రయాలు నగర మహిళలను విశేషంగా ఆకట్టుకున్నాయని నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ విధానం తెలిపారు. గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతి గాంచిన 50 మందికి పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లను తీసుకొచ్చి నగర ప్రజలకు లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలను పరిచయం చేశామన్నారు. ఈ ప్రదర్శన 8వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాములోరి రథానికి ఘన స్వాగతం

రాజానగరం: లోకశాంతి, ప్రజాసంక్షేమాన్ని కోరుతూ కాకినాడలోని అచ్చంపేట నుంచి భద్రచలానికి రామనామ స్మరణతో వాసుదేవ గురుస్వామి ఆధ్వర్యంలో వెళ్తున్న రాములోరి రథం సోమవారం ఉదయం దివాన్ చెరువు చేరుకుంది. సుమారు 300 మంది రామభక్తులతో వెళ్తున్న ఈ రథానికి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న లక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు గ్రంధి నానబ్బులు, కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. రామభక్తులకు అల్పాహారం అందజేశారు. ఉపాధ్యాయుడు జి.వెంకటరెడ్డి యాపిల్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ ఏటా ఈ విధంగా రథంతో సుమారు 280 కిలోమీటర్లు దూరంలోని భద్రాచలంలో సీతారాముల దర్శనానికి పాదయాత్ర చేస్తున్నామన్నారు. ఈ నెల 4న కాకినాడలో ప్రారంభించిన ఈ యాత్ర 13 నాటికి భద్రాచలం చేరుకుంటుందన్నారు.

సినిమాలు



శ్యామల : వారసుడు
సూర్యమినీ : మాలికాపురం
సూర్యప్యాలెస్ : పఠాన్
స్వామి : వాల్తేరు వీరయ్య
శివజ్యోతి : మైఖేల్
అనుశ్రీ : మైఖేల్
రాజా : పఠాన్
అశోక : వీరసింహారెడ్డి
కుమారి : సువర్ణ సుందరి
ఊర్వశి : పఠాన్
రంభ : బుట్టబొమ్మ
మేనక : ప్రేమదేశం
గీతాఅప్సర : రైటర్ పద్మభూషణ్

నామవరం
వీఎస్ మహల్ : పఠాన్

ధవళేశ్వరం
మురళీకృష్ణ : వాల్తేరు వీరయ్య

కడియం
వెంకటసూర్య : మైఖేల్